7

సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 5 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

అమరులకు సలామ్



నేవీ డే సందర్భంగా సోమవారం బీచ్‌రోడ్డులో అమర వీరుల స్మృతి చిహ్నం వద్ద అమర వీరులైన జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు. - బీచ్‌రోడ్డు

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.17.62 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం చేపట్టారు. గత నెల 8వ తేదీ నుంచి ఈ నెల 4వ తేదీ వరకు హుండీల ద్వారా వచ్చే ఆదాయాన్ని లెక్కించారు. రూ.17 లక్షల 62 వేల 400 నగదు, 45 గ్రాముల 900 మిల్లీ గ్రాముల బంగారం, 349 గ్రాముల వెండి లభించింది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు చెందిన 47 డాలర్లు, ఖతార్ సెంట్రల్ బ్యాంక్‌కు చెందిన 1 రియల్ వచ్చాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, శ్రీహరిసేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల కోసం సంఘటిత పోరాటం అవసరం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ ప్రసాద్

ఉక్కునగరం: హక్కుల కోసం సంఘటితంగా పోరాటం చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో 'భారత రాజ్యాంగం–భవిష్యత్ సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. దేశంలో మన ఆడపడుచులపై దాడులు జరుగుతున్నా మనం ఉపకులాలుగా విడిపోయి ఉండటంతో ప్రశ్నించలేక పోతున్నామన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం దేశానికి దిక్సూచిలాంటిదని, అది నేడు ప్రమాదంలో పడిందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా పోరాడాలన్నారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బూల జగ్జీవన్‌రామ్, బి.ఎ.స్వామి, దువ్వాడ సీఐ బి.శ్రీనివాసరావు, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, స్టీల్‌ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు.

17న రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక : రాష్ట్ర న్యూ కిక్ బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న గాజువాకలో 13వ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలను నిర్వహించనున్నట్టు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు కరణం రెడ్డి నర్సింగరావు తెలిపారు. పోటీల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక అమరావతి పార్కు మైదానంలో ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను వచ్చేనెలలో ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, ప్రతినిధులు ప్రేమ్ కుమార్, కరణం సన్ని, కోచ్‌లు వెంకట్, ఆనంద్, రేవంత్, ఆదిత్య, రంజిత్ పాల్గొన్నారు.

● తుపాను ఎఫెక్ట్

అప్రమత్తం



తుపాను ప్రభావంతో ఒడ్డుకు చేరిన పడవలు

- సహాయక చర్యలకు అధికార యంత్రాంగం సన్నద్ధం
- 64 చోట్ల తుపాను షెల్టర్లు ఏర్పాట్లు
- లోతట్టు ప్రాంతాల్లో 2 ఎన్డీఆర్ఎఫ్, 2 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు
- తుపాను సమాచారంపై 8 కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- సీఎం వైఎస్ జగన్ సమీక్షలో కలెక్టర్ మల్లికార్జున వెల్లడి

సాక్షి, విశాఖపట్నం : మిచాంగ్ తుపాను విశాఖ జిల్లాపై ప్రభావం చూపితే.. సహాయక చర్యలు అందించేందుకు వందలాది మంది సిబ్బంది సన్నద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేయడం, ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామని, 64 చోట్ల తుపాను షెల్టర్లు ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. తుపాను రక్షణ చర్యలపై సీఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ, ఇతర విభాగాధికారులతో కలిసి కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని జిల్లాలో చేపట్టిన చర్యలను ముఖ్యమంత్రికి కలెక్టర్ వివరించారు. మిచాంగ్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలివీ..

- జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.
- వర్షపాత నమోదు వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు చేస్తున్నారు.
- జీవీఎంసీ పరిధిలో 37 లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను తరలించేందుకు 34 తుపాను షెల్టర్లను ఏర్పాటు చేసి తగిన వసతులు సిద్ధం చేశారు.
- గ్రామీణ పరిధిలో 23 లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను తరలించేందుకు 30 తుపాను షెల్టర్లను ఏర్పాటు చేశారు.
- సహాయక చర్యల కోసం 2 ఎన్డీఆర్ఎఫ్, 2 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయి.
- ఏడు మండలాల పరిధిలో అన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టేందుకు అధికారులు, ప్రభుత్వ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు.
- వరి కోతలను వాయిదా వేసుకోవాలని రైతులను అప్రమత్తం చేశారు. కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
- విద్యుత్ పరమైన సమస్యలు రాకుండా ముందుస్తు చర్యలు చేపట్టారు. 600 మందికి పైగా సిబ్బందిని అందుబాటులో ఉంచారు. జనరేటర్లు సిద్ధం చేశారు.
- 578 మంది సచివాలయ సిబ్బందితో ప్రత్యేక బృందాలను నియమించారు.
- నగర సమీపంలోని రిజర్వాయర్లలో నీటిమట్టాల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సిబ్బందిని అలెర్ట్ చేశారు. ప్రమాదకరస్థితికి నీటి మట్టం చేరుకునే పరిస్థితులు కనిపిస్తే.. చర్యలు చేపట్టేందుకు ఆయా రిజర్వాయర్ల పరిధిలో అధికారులు, సిబ్బంది సన్నద్ధంగా ఉన్నారు.
- గర్భిణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఏఎన్ఎంలు, ఆశావర్కర్లను అనుసంధానం చేశారు.
- కోస్ట్‌గార్డ్, నేవీ, మెరైన్ పోలీసులు మొదలైన తీర ప్రాంత రక్షక దళాలతో కమిషనర్, కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు.
- భారీ వర్షాలు కురిసే అవకాశాలున్న నేపథ్యంలో మంగళవారం కూడా అన్ని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు.
- కలెక్టరేట్, జీవీఎంసీ పరిధిలో 8 జోనల్ కార్యాలయాల్లోనూ, 11 మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో 6వ తేదీ వరకూ 24 గంటలూ సేవలందించేలా కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

సోమవారం కురిసిన వర్షం(సెం.మీలలో)

ప్రాంతం	వర్షపాతం		
మల్కాపురం	3.6	మింది	2.5
కొత్తపాలెం	2.9	గాజువాక	2.5
పెదగంట్యాడ	2.7	గోపాలపట్నం	2.4
సింహాచలం	2.6	మహారాణిపేట	2.2
పెందుర్తి	2.6	రైల్వే న్యూకాలనీ	2.2
		సీతమ్మధార	2.0
		విశాఖ రూరల్	2.0



సెల్ఫీలు దిగుతున్న మహిళలు

నేడు పాఠశాలలు, కాలేజీలకు సెలవు

విశాఖ విద్య: తుపాను నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంగళవారం జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. అదే విధంగా జూనియర్ కాలేజీలకు కూడా సెలవు ఇస్తున్నట్లు ఆర్ఐవో రాయల సత్యనారాయణ వెల్లడించారు. ఈదురు గాలులతో భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యార్థుల ఆరోగ్య భద్రత దృష్ట్యా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఏయూకు కూడా..

ఏయూక్యాంపస్: తుపాను నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి మంగళవారం సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల విధులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు, రేపు వర్షాలు



మిచాంగ్ తుపాను ప్రభావంతో సోమవారం వేకువజాము నుంచి విశాఖ నగరంతో పాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోనూ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మధ్యమధ్యలో కాస్త విరామం ఇస్తూ వానలు కొనసాగుతున్నాయి. వర్షాలతో పాటు ఈదురుగాలులు బలంగా వీస్తున్నాయి. చలితో కూడిన ఈ గాలులు జనాన్ని ఒకింత వణికిస్తున్నాయి. తుపాను మంగళవారం మధ్యాహ్నానికి బాపట్లకు సమీపంలో తీరాన్ని దాటనుంది. ఆ ప్రభావంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో మంగళ, బుధవారాల్లో వర్షాలు కురవనున్నాయి. తుపాను దృష్ట్యా ప్రభుత్వం సోమ, మంగళవారాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది.

కంట్రోల్ రూమ్‌లు

కలెక్టరేట్	జీవీఎంసీ(టోల్‌ఫ్రీ)	ఏపీఈపీడీసీఎల్
0891-2590100, 0891-2590102	180042500009, 0891-2869106	0891-2718091, 7382299975

మెడికల్- 9993489519 ఫైర్ - 101, 0891-2563582 మత్స్యశాఖ- 9390125477

డివిజనల్ స్థాయిలో..

విశాఖ ఆర్డీవో కార్యాలయం 9866787763

భీమిలి ఆర్డీవో కార్యాలయం 8500734471

జర్నీకి బ్రేక్

- ఇప్పటికే 80కి పైగా రైళ్ల రద్దు
- నేడు 19 విమాన సర్వీసులూ క్యాన్సిల్
- బస్సుల రద్దుపై వేచిచూస్తున్న ఆర్టీసీ అధికారులు



సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావం ప్రయాణికులపై పడింది. వివిధ ప్రాంతాలకు వెళ్లే వారి ప్రయాణాలకు బ్రేకులు వేసింది. చెన్నై నుంచి విశాఖపట్నం వరకు తుపాను ప్రభావం ఉంది. దీని ధాటికి భారీ నుంచి అతి భారీ వర్షాలు, అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా తమిళనాడుతో పాటు తిరుపతి, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో కుంభవృష్టి కురుస్తోంది. మరో రెండ్రోజులు భారీ వర్షాలు కొనసాగనున్నాయి. ఫలితంగా రైల్వే ట్రాక్‌లు వరద నీటిలో చిక్కుకోవడం గాని, కొట్టుకుపోవడం గాని జరిగే అవకాశాలున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యగా రైల్వే శాఖ తమిళనాడు నుంచి విశాఖపట్నం వైపు వచ్చే, విశాఖ మీదుగా విజయవాడ, తమిళనాడు వైపు వెళ్లే దాదాపు 80కి పైగా ఎక్స్‌ప్రెస్, పాసింజరు రైళ్లను ఇప్పటికే రద్దు చేసింది. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే వారు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలను రద్దు చేసుకోవలసి వచ్చింది. మళ్లీ ఏడో తేదీ నుంచి రద్దయిన రైళ్లను దశలవారీగా పునరుద్ధరించనున్నారు. మరోవైపు ప్రతికూల వాతావరణంతో 19 విమాన సర్వీసులు క్యాన్సిల్ అయ్యాయి. సోమవారం విశాఖపట్నం–చెన్నై, విశాఖపట్నం–హైదరాబాద్, విశాఖపట్నం–విజయవాడ, విశాఖపట్నం–తిరుపతి, చెన్నై– విశాఖపట్నం, హైదరాబాద్–విశాఖపట్నంల మధ్య నడిచే విమానాలను రద్దు చేశారు. అలాగే విశాఖ నుంచి ఇండిగో విమానాలన్నీ మంగళవారం రద్దయ్యాయి.

వర్ష తీవ్రతను బట్టి ఆర్టీసీ నిర్ణయం

సాధారణంగా రైళ్లు రద్దయినప్పుడు ఆ ప్రభావం బస్సులపై పడుతుంది. కానీ ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. రైళ్లకు బదులు బస్సుల్లో దూర ప్రాంతాలకు వెళ్లడానికి జనం ఆసక్తి చూపించడం లేదు. తుపాను తీవ్రత తగ్గాకే వెళ్లవచ్చన్న భావనతో వీరు తమ ప్రయాణాలను తాత్కాలికంగా రద్దు చేసుకున్నారు. మరోవైపు తీవ్ర తుపాను కొనసాగుతున్నా ఆర్టీసీ అధికారులు తమ దూరప్రాంత సర్వీసులను సోమవారం రాత్రి వరకు నడిపారు. ప్రధానంగా తుపాను ప్రభావం రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రపై చూపుతోంది. విశాఖ నుంచి కడప, తిరుపతి, ప్రొద్దుటూరు, కర్నూలుతోపాటు విజయవాడ, గుంటూరు, భీమవరం తదితర ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. మంగళవారం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏఏ సర్వీసులను ఎక్కడ వరకు నడపాలన్న దానిపై నిర్ణయం తీసుకోనున్నట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

తుపాను రక్షణ చర్యలు చేపట్టండి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

అల్లిపురం: తుపాను తీవ్రత అధికంగా ఉన్నందున అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. ఆయన సోమవారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో లోతట్టు ప్రాంతాలు, కొండవాలు ప్రాంతాల్లో పరిస్థితిపై సమీక్షించారు. మరో రెండు రోజులు వర్షాలు విస్తారంగా పడే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : మిచాంగ్ తుపాను కారణంగా విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు ఆయా తేదీలలోరద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈ నెల 5వ తేదీన తిరుపతి–బిలాస్‌పూర్(17480) ఎక్స్‌ప్రెస్, తిరుపతి–విశాఖపట్నం(08584) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరుచునాపల్లి - హౌరా ఎక్స్‌ప్రెస్, కేఎస్ఆర్ బెంగళూరు–న్యూటిన్‌సుకియా జంక్షన్ (22501) ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు– అగర్తలా (12503) ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి. 6వ తేదీన పూరీ–తిరుపతి (17479) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

అత్యవసర సేవలకు నిరంతర విద్యుత్

- తుపాన్ షెల్టర్స్, హాస్పిటల్స్‌కు అంతరాయం కలగకూడదు
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆదేశం
- 5 సర్కిళ్లలో కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు



సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల కలిగే విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సంస్థ డైరెక్టర్లు, 5 సర్కిళ్ల అధికారులకు అవసరమైన సూచనల్ని సీఎండీ చేశారు. ప్రమాదాలు, అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912కి తెలియచేయాలన్నారు. తుపాను సహాయక కేంద్రాలకు, హాస్పిటల్స్‌కు తప్పనిసరిగా విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల ఎస్ఈలను ఆదేశించారు. తుపాను ప్రభావానికి తెగిపడే విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను అందుబాటులో ఉంచాలని ఎస్ఈలను ఆదేశించారు. డైరెక్టర్ ఆపరేషన్స్ బి.రమేష్ ప్రసాద్ రాజమండ్రి సర్కిల్‌లోనూ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఏవీవీ సూర్యప్రతాప్ ఏలూరు సర్కిల్‌లో పునరుద్ధరణ చర్యల ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్ అంతరాయాల ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకునేందుకు ఐదు జిల్లాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సీఎండీ తెలిపారు. సమాచారాన్ని టోల్ ఫ్రీ నం. 1912, వాట్సాప్ నంబర్ 8500001912, కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు

టోల్ ఫ్రీ నంబర్	1912
కార్పొరేట్ కార్యాలయం	9440816373
విశాఖపట్నం	7382299975

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం : పుణ్యక్షేత్రాలను, పలు ఆలయాలను సందర్శించాలనుకునే యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు ప్యాకేజీలను ప్రకటించింది. ఈ సీజన్‌లో ఇప్పటికే తొమ్మిది యాత్రలను పూర్తిచేసి, పదో యాత్ర కోసం ఐఆర్‌సీటీసీ సిద్ధమైంది. ఈ టూర్‌లో కుటుంబ సమేతంగా, సీనియర్ సిటిజన్స్‌కు చక్కని అవకాశం అందుబాటులోకి రానుంది. మొదటిసారిగా అయోధ్య వంటి ప్రాంతాలను కూడా ఈ టూర్‌లో సందర్శించే అవకాశం కల్పిస్తున్నారు. ఈ మేరకు ఐఆర్‌సీటీసీ, సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ బిసా సోమవారం టూర్ వివరాలు తెలిపారు. కేవలం ఈ యాత్రకోసం ఐఆర్‌సీటీసీ 7 స్లీపర్, 3–థర్డ్ ఏసీ, 1–సెకండ్ ఏసీ కోచ్‌లతో ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు ఆయన తెలిపారు.

భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ (పుణ్యక్షేత్ర యాత్ర) యాత్ర మొత్తం 8 రాత్రులు, 9 పగళ్లు ఉంటుంది. ఈ యాత్రకు సంబంధించిన ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో డిసెంబరు 9వ తేదీన బయల్దేరుతుంది. ఈ యాత్రలో ప్రయాణించాలనుకునే వారు పెందుర్తి, విజయనగరంలలో మాత్రమే ఈ రైలు ఎక్కాల్సి ఉంటుంది. అదే స్టేషన్‌లలో తిరిగి దిగుతారు. ఈ యాత్రలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన పూరి, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లలో గల జగన్నాథ్‌టెంపుల్, విష్ణుపాదం టెంపుల్, కాశీ విశ్వనాథటెంపుల్, విశాలాక్షి టెంపుల్, అన్నపూర్ణదేవి టెంపుల్, గంగా ఆరతి, రామ్ జన్మభూమి, హనుమాన్ గర్హి టెంపుల్, త్రివేణి సంగమం, హనుమాన్ మందిర్, శంకర్ విమాన్ మండపం వంటి ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు. ఒకొక్కరికి టికెట్, వసతి, స్థానిక రవాణా చార్జీలతో కలిపి ఎకానమి రూ.15,200, పిల్లలకు (5–11 ఏళ్ల లోపు) రూ.14,200, స్టాండర్డ్ రూ.24,000, పిల్లలకు(5–11 ఏళ్ల లోపు) రూ.22,900 , కంఫర్ట్ రూ.31,500, పిల్లలకు (5–11 ఏళ్ల లోపు) రూ.30,100 (అన్ని పన్నులు, జీఎస్టీతో కలిపి)గా ఐఆర్‌సీటీసీ నిర్ణయించింది. ఎకానమి ప్రయాణికులకు నాన్ ఏసీ బడ్జెట్ హోటల్, నాన్ ఏసీ వాహనాలలో తీసుకువెళ్తారు. స్టాండర్డ్ / కంఫర్ట్ ప్రయాణికులకు థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ రూంలలో వసతి కల్పిస్తారు, నాన్ ఏసీ/ఏసీ వాహనాల్లో తీసుకువెళ్తారు.

సదుపాయాలు ఇవే..

- ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం(వెజిటేరియన్)
- అన్ని పార్కింగ్ చార్జీలు, టోల్ చార్జీలు, జీఎస్టీలతో కలిపి ఈ యాత్రల గురించిన మరిన్ని వివరాలకు విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ, చందన్‌కుమార్ - 82879 32318, సాయిప్రసాద్ - 92814 95847, ఎస్ విశాలాక్షి–97010 85461 నంబర్లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ బిసా తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు బంపర్ ఆఫర్

- ప్రతిభ చూపిన వారికి ఐటీ కొలువు
- ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు
- అండగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందేలా తోడ్పాటు
- కాలేజీలకే రానున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలు
- ఈ నెల 20న హెచ్‌సీఎల్ టెక్–బీ పరీక్ష



విశాఖలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థినులు

విశాఖ విద్య: ఇంటర్‌తోనే ఐటీ కొలువులు దక్కించుకోవచ్చు. ఉద్యోగం చేస్తూనే పేరొందిన యూనివర్సిటీల్లో డిగ్రీ, ఆ పైకోర్సులను చదువుకోవచ్చు. హెచ్‌సీఎల్ టెక్–బీ పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి ఇలాంటి అరుదైన అవకాశం లభించనుంది. ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలతో సాఫ్ట్‌వేర్ కంపెనీలు కాలేజీలకే వచ్చి నైపుణ్యం గల విద్యార్థులను ఎంపిక చేసుకొని వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి, ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయి. ఇప్పటివరకు డిగ్రీ, పీజీ కోర్సులు చేసిన వారికే ఇలాంటి అవకాశం దక్కుతుండగా, తాజాగా ఇంటర్ విద్యార్థులకు సైతం చక్కటి అవకాశం లభించనుంది.

16లోగా దరఖాస్తు చేసుకోవాలి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు. https://bit.ly/Tech beeGoAP వెబ్‌సైట్‌లో విద్యార్థుల పూర్తి వివరాలను నమోదు చేసి ఈ నెల 16లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థులు మూడు దశల్లో పరీక్షలు రాయాలి. తొలుత రాత పరీక్ష, ఆ తరువాత ఇంగ్లిష్ నైపుణ్య పరీక్ష నిర్వహిస్తారు. ఈ రెండింటిలో ప్రతిభ చూపిన వారిని ఇంటర్వ్యూకు పిలుస్తారు. దీనిలో అర్హత సాధించిన వారికి ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ కాలంలో ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేలు చొప్పున స్టైఫండ్ ఇస్తారు. అనంతరం మంచి వేతనంతో కూడిన ఉద్యోగం దక్కనుంది.

ఫోన్లలో పరీక్ష రాసే అవకాశం

విశాఖ జిల్లాకు చెందిన విద్యార్థులకు ఈ నెల 20న, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 22న పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఆన్‌లైన్ కాట్ టెస్టు పేరిట నిర్వహించే ఈ పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో చదివే విద్యార్థులంతా అర్హులే. ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్న ఈ పరీక్షకు విద్యార్థులు తమ సొంత సెల్‌ఫోన్లు కూడా ఉపయోగించుకోవచ్చు.

ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు

ఇంటర్ బోర్డుతో హెచ్‌సీఎల్ టెక్–బీ సాఫ్ట్‌వేర్ కంపెనీ చేసుకున్న ఒప్పందం మేరకు విద్యార్థులకు ఇటువంటి అరుదైన అవకాశం లభించనుంది. ఇంటర్‌లో ఎంపీసీ, ఎంఈసీ గ్రూపు విద్యార్థులకు ఐటీ రంగంలోనూ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులు చదివిన వారికి అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి డీపీవో విభాగంలో ఉద్యోగాలు కల్పించనున్నారు. ఎంపికైన విద్యార్థులు ఉద్యోగం చేసుకుంటూనే డిగ్రీ, ఆ పైస్థాయి కోర్సులను చదువుకోవచ్చు. కోర్సు ఫీజులో ఏడాదికి రూ.15 వేలకు తక్కువ కాకుండా హెచ్‌సీఎల్ కంపెనీ చెల్లించనుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఇంటర్‌తోనే ఉద్యోగం దక్కించుకునేలా ప్రభుత్వం విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తోంది. చదువుల్లో రాణించే విద్యార్థులకు ఇదో చక్కటి అవకాశం. దీనిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలి. ఎక్కువ మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా కాలేజీల ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకోవాలి. దీనిపై కాలేజీల స్థాయిలో అవగాహన సదస్సులను కూడా నిర్వహిస్తున్నాం.

– రాయల సత్యనారాయణ, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

అర్జీలకు సత్వర పరిష్కారం


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున


సమస్య వింటున్న అదనపు కమిషనర్ శ్రీనివాసరావు


సమస్యలు తెలుసుకుంటున్న డీసీపీ లక్ష్మీనారాయణ

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జగనన్నకు చెబుదాం కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. 150 మంది అర్జీదారులు తమ వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. సకాలంలో పరిష్కారం కాని అర్జీలపై సంబంధిత అధికారుల దృష్టి సారించాలన్నారు. జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాలపై కూడా అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. సోమవారం నాటి అర్జీలలో 66 రెవెన్యూ శాఖకు, 37 జీవీఎంసీకి , 17 పోలీసు శాఖకు, 30 ఇతర శాఖలకు సంబంధించి అర్జీలు వచ్చాయన్నారు. ఏసీపీ బాపూజీ, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్, డీఎల్‌డీవో పూర్ణిమాదేవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 'జగనన్నకు చెబుదాం'కు 57 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు సోమవారం జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు ఫిర్యాదులు స్వీకరించారు. 57 వినతులు వివిధ జోన్ల నుంచి అందాయి. నిర్ణీత సమయంలో ఫిర్యాదులు పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, సీసీపీ సురేష్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టీకల్చర్ ఎం.దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, కార్యదర్శి పి.నల్లనయ్య, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, పర్యవేక్షక ఇంజినీర్లు కృష్ణారావు, శ్యాంసన్‌రాజు, గోవిందరావు, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 34 ఫిర్యాదులు

అల్లిపురం: పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 34 ఫిర్యాదులు వచ్చినట్లు డీసీపీ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్యభర్తల గొడవలు, మోసానికి సంబంధించిన వాటితో పాటు సివిల్ తగాదాలు ఉన్నాయని తెలిపారు.

ఎస్‌డీఐను సందర్శించిన ఏసీపీ


స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్

ఆరిలోవ: తూర్పు జోన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ జాన్ మనోహర్ ట్రాఫిక్ సీఐ ప్రసాద్‌తో కలిసి సోమవారం ముడసర్లోవ వద్ద హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్‌డీఐ)ను సందర్శించారు. త్వరలో అక్కడకు జీవీఎంసీ కార్యాలయాలను తరలించే ప్రయత్నంలో అధికారులు ఉన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ట్రాఫిక్ ఏసీపీ ఇక్కడ ఎస్‌డీఐ అధికారులతో చర్చించారు. ఎస్‌డీఐ ఎప్పుడు ఖాళీ చేయనున్నారు. ఇక్కడ నుంచి తరలించడానికి ఇంకా ఏఏ వస్తువులు మిగిలి ఉన్నాయో ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి పల్లె శ్రీనివాసరావును అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ముడసర్లోవ నుంచి హనుమంతవాక వరకు బీఆర్‌టీఎస్ రోడ్డును పరిశీలించారు. జీవీఎంసీకి సంబంధించిన ప్రధాన కార్యాలయాలు ఇక్కడకు తరలిస్తే ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని, దానికి అనుగుణంగా ఎలాంటి చర్యలు చేపట్టాలో సీఐతో కలిసి చర్చించారు. ఎస్‌డీఐ భవనంలోకి జీవీఎంసీ కార్యాలయాలు తరలించే నేపథ్యంలో ముందు జాగ్రత చర్యల్లో భాగంగా పరిశీలిస్తున్నట్టు ఏసీపీ మనోహర్ తెలిపారు.

నృసింహ దీక్షలు ప్రారంభం


దీక్ష తీసుకునేందుకు వచ్చిన భక్తులు

- 450 మంది మాలధారణ
- జనవరి 6న దీక్ష విరమణ


దీక్షాధారుడికి మాలధారణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ నృసింహ దీక్షలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 32 రోజులపాటు దీక్ష సాగనుంది. దీక్ష స్వీకరించడానికి వచ్చిన సుమారు 450 మందికి సింహగిరిపై మాలధారణ చేసే కార్యక్రమాన్ని దేవస్థానం వైదిక, అధికార వర్గాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింహగిరిపై ఉన్న ప్రిలిగ్రిమ్స్ భవనంలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటుచేసి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రతిమలను ఉంచారు. దీక్ష తీసుకునేందుకు వచ్చిన వారిని ఆశీనింపజేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు మేళతాళాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలోంచి తులసి మాలలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. స్వామిచెంతన తులసిమాలలను ఉంచి అర్చకులు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారి అష్టోత్తర శతనామావళిని దీక్షాధారులందరిచేత పఠింపజేశారు. అనంతరం దీక్షాధారులకు మాలధారణ చేశారు. దేవస్థానం తరఫున దీక్షా వస్త్రాలను, క్షేత్ర పురాణం కరపత్రాలను ఈవో అందజేశారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు, వేద పండితులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్ష తీసుకున్నవారిలో సింహాచలంలోని చందన పెరుమాళ్ల పీఠం, సింహాద్రి మఠానికి చెందిన సభ్యులు, విశాఖ ఏజెన్సీ ప్రాంత గిరిజనులు, ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశాలోని పలు ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు ఉన్నారు. చందన పెరుమాళ్ పీఠం గురుస్వామి సానబోయిన రాజు, సింహాద్రి మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి కార్యక్రమంలో పాల్గొన్నారు. 32 రోజులు దీక్షలు తీసుకున్నవారితో పాటు, 41రోజులు దీక్ష తీసుకున్న వారంతా రానున్న జనవరి 6వ తేదీన దీక్ష విరమించాల్సి ఉంటుందని, ఆరోజు దీక్షావిరమణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని ఈవో శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు.



మత్స్యకారుల అప్రమత్తం

తుపాను దృష్ట్యా రానున్న రెండు రోజుల్లో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. రుషికొండ, మంగమారిపేట, ఫిషింగ్ హార్బర్‌లో వలలు,బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

శభాష్ వలంటీర్లు

పెదగంట్యాడ: వార్డు వలంటీర్లు పెద్ద మనసు చాటుకుంటున్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని సంజీవిగిరి కాలనీకి చెందిన ఎం.పైడిరాజు అనే వృద్ధుడు నెల్లిమర్ల మిమ్స్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్నాడు. దీంతో ఈ నెల పెన్షన్‌ను వలంటీర్ లీలావతి నెల్లిమర్లలోని ఆస్పత్రికి వెళ్లి అందజేశారు. దీంతో అతని కుటుంబ సభ్యులు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు.


150 కి.మీ. వెళ్లి.. పింఛన్ అందజేసి..

పరవాడ: వృద్ధాప్యంలో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు బెంజుపురం నూకాలమ్మ (80) రెండు నెలల క్రితం విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఉంటున్న కుమారుడు వద్దకు వెళ్లింది. తానాం గ్రామానికి చెందిన వలంటీరు పైల పైడింనాయుడు సుమారు 150 కిలోమీటర్లు తన బైక్ ప్రయాణించి బొబ్బిలిలో ఆమెకు పింఛను అందజేశాడు. రెండు నెలల పెన్షన్ అందజేయడంతో నూకాలమ్మ ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా వలంటీర్ పైడింనాయుడును పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, గ్రామ ప్రజలు అభినందించారు.


నూకాలమ్మకు పెన్షన్ అందజేస్తున్న పైడింనాయుడు


పైడిరాజుకు పెన్షన్ అందజేస్తున్న లీలావతి

లెజెండ్స్ క్రికెట్ లీగ్ చివరి మ్యాచ్ రద్దు


వర్షం కారణంగా పిచ్‌పై కవర్లు

విశాఖ స్పోర్ట్స్: మిచాంగ్ తుపాను కారణంగా వైఎస్సార్ స్టేడియంలో సోమవారం జరగాల్సిన మ్యాచ్ రద్దయింది. లీగ్‌లో చివరిదైన మ్యాచ్‌లో మణిపాల్ టైగర్స్‌తో అర్బన్ రైజర్స్ హైదరాబాద్ తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో విజయంతో నాకవుట్ ఖరారు కావల్సి ఉండగా ఎడతెరిపిలేని వర్షంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. ఇరు జట్ల కెప్టెన్లతో పాటు అంపైర్లు పిచ్ పరిశీలించిన అనంతరం రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లు ఒక్కో పాయింట్‌ను ఖాతాలో జమచేసుకున్నాయి. ఇప్పటికే విశాఖ వేదికగానే గుజరాత్ జెయింట్స్ చివరి లీగ్ మ్యాచ్ ఆడి మూడు విజయాలు, ఒక పరాజయంతో ఏడు పాయింట్లు సాధించిన విషయం తెలిసిందే. లీగ్ చివరి మ్యాచ్ ఆధిక్యానికి జరగాల్సి ఉండగా రద్దు కావడంతో టైగర్స్, అర్బన్ రైజర్స్ జట్లు సైతం ఏడేసి పాయింట్లతో నిలిచి సమవుజ్జీగా నిలిచాయి. అయితే నెట్ రన్‌రేట్ 1.224తో టైగర్స్ ఆధిక్యాన్ని ప్రదర్శించగా...అర్బన్ రైజర్స్ .514తో ద్వితీయ స్థానంలోనూ, జెయింట్స్ .083తో తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఇక మూడేసి పాయింట్లే సాధించిన సూపర్‌స్టార్స్, కింగ్స్ కంటే కాస్త మెరుగైన రన్‌రేట్‌తో ఇండియా క్యాపిటల్స్ నాకవుట్‌కు అర్హత సాధించింది. టైగర్స్ జట్టును హార్భజన్ సింగ్, అర్బన్ రైజర్స్‌ను సురేష్‌రైనా, జెయింట్స్‌ను పార్థీవ్, క్యాపిటల్స్ జట్టును గౌతమ్ గంభీర్ ముందుకు నడిపించి నాకవుట్‌కు చేర్చారు.

పీఎంపాలెంలో పెన్షన్ సొమ్ము చోరీ

పోలీసులకు ఫిర్యాదు

మధురవాడ: పీఎంపాలెం 41వ వార్డు సచివాలయంలో రూ.49,475 పింఛన్ సొమ్ము చోరీకి గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి బక్కన్నపాలెం 41వ వార్డు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ అన్నపూర్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 30వ తేదీన బ్యాంకు నుంచి సుమారు రూ.8 లక్షలు పింఛన్ నగదు తీసుకొచ్చాం. ఆ మొత్తం సాయంత్రం వలంటీర్లకు అందజేసేందుకు అడ్మిన్, ఇతర సచివాలయ సిబ్బంది సమక్షంలోనే పంపిణీ మొదలు పెట్టాం. ఈ క్రమంలో తన వద్ద ఉన్న నగదులో రూ.49,475 చోరీకి గురైందని గమనించాం. అయితే బాధిత పింఛన్‌దారులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని తన గాజులు తాకట్టు పెట్టి ఆ మొత్తాన్ని జమ చేసినట్టు అన్నపూర్ణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సచివాలయ సిబ్బంది.. మధురవాడ జోనల్ కార్యాలయానికి వచ్చి జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి దొంగలను పట్టుకోవాలని పీఎంపాలెం పోలీసులను అన్నపూర్ణ కోరారు. ఇకపై పెన్షన్ సొమ్ము బ్యాంకు నుంచి తెచ్చి వలంటీర్లకు ఇచ్చేంతవరకు మహిళా పోలీసులు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కనక మహాలక్ష్మి చెప్పారు.


నగదు చోరీపై కనక మహాలక్ష్మికి వివరిస్తున్న సచివాలయ సిబ్బంది

సాయుధ దళాల పతాక నిధికి విరాళాల సేకరణ


పతాక స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: దేశ రక్షణకు నిరంతరం సేవలు అందిస్తూ యుద్ధంలో మరణించిన, గాయపడిన, పదవీ విరమణ చేసిన సాయుధ దళాల కుటుంబాల సంక్షేమానికి సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ సాయుధ దళాల పతాక స్టిక్కర్లను ఆవిష్కరించారు. వీటిని వివిధ ప్రభుత్వ శాఖలకు విక్రయించి విరాళాలు సేకరించాలని కలెక్టర్ కోరారు. విద్యార్థులు, కార్మికుల నుంచి సైనిక సంక్షేమానికి విరాళాలు సేకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా పరిశ్రమల శాఖాధికారికి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తరులు వారికి పంపారు.

పతాక నిధి వసూలు

స్కూలులో చదువుతున్న విద్యార్థుల నుంచి రూ.2 చొప్పున, కాలేజీలో చదువుతున్న వారి నుంచి రూ.5, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల నుంచి రూ.50 చొప్పన పతాక నిధిని వసూలు చేసి ఆ విరాళాలను జిల్లా సైనిక సంక్షేమ అధికారి, విశాఖపట్నం వారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబరు (62078532988)కు జమ చేసి తర్వాత జిల్లా సైనిక సంక్షేమ అధికారి వారికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం, పర్యవేక్షకుడు జి.కృష్ణారావు, సీనియర్ సహాయకులు వైఏవీ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.60
బ్రాయిలర్ (లైవ్)	: రూ.80
స్కిన్	: రూ.130
స్కిన్‌లెస్	: రూ.140

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	535.00
విజయనగరం	539.00
శ్రీకాకుళం	539.00

శతశాతం లక్ష్యంగా..

- ఇంటర్‌లో మెరుగైన ఫలితాలపై కార్యాచరణ
- ప్రభుత్వ కాలేజీల్లో రోజూ స్పెషల్ క్లాసులు
- ఉత్తీర్ణత శాతం పెరిగేలా పటిష్టమైన ప్రణాళిక
- సబ్జెక్టు ఉపాధ్యాయులకు బాధ్యతలు
- కాలేజీల వారీగా చదువుల సామర్థ్యంపై సమీక్ష
- ప్రభుత్వ కాలేజీల్లో గతేడాది కంటే పెరిగిన విద్యార్థులు
- జిల్లాలో పది కాలేజీల్లో 6,196 మందికి చదువులు


విశాఖలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తరగతులకు హాజరైన విద్యార్థినులు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలపై పక్కా ప్రణాళికతో విద్యాశాఖాధికారులు ముందుకు వెళుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నూరుశాతం ఫలితాలు సాధించేలా దృష్టి సారించారు. కాలేజీల్లో రెగ్యులర్ తరగతులతో పాటు, స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఫస్టియర్‌లో 63 శాతం, సెకెండ్ ఇయర్‌లో 70 శాతం ఫలితాలు వచ్చాయి. అయితే ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు ఉత్తీర్ణత శాతంలో కాస్తా వెనుకబడ్డారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 2023-24 విద్యా సంవత్సరానికి ముందస్తు కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రైవేటు కాలేజీలకు దీటుగా ఫలితాలు సాధించేలా రోజూ సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఏ రోజు ఏ సబ్జెక్టుకు సంబంధించి బోధన జరగాలనేది షెడ్యూల్ సిద్ధం చేసి, అందుకనుణంగా అధ్యాపకులకు బాధ్యతలు అప్పగించారు.

నాణ్యమైన చదువులే లక్ష్యం

గతంలో అయితే ప్రాక్టికల్స్ తరగతులు నామమాత్రంగానే సాగేవి. కానీ నాణ్యమైన చదువులకు ప్రాధాన్యత ఇవ్వాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని కాలేజీలో ప్రాక్టికల్స్ నిర్వహణ ఎలా ఉందనేది ఆర్ఐవో, డీవీఈవోలు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసే క్రమంలో స్పెషల్ క్లాసులు నిర్వహిస్తుండగా, ఆ రోజు జరిగిన సబ్జెక్టుపై విద్యార్థులు ఏ మేరకు అవగాహన పొందారనేది మరుసటి రోజు సమీక్ష చేసేలా అధ్యాపకులకు బాధ్యతలు అప్పగించారు. దీంతో సబ్జెక్టులపై విద్యార్థులు పట్టు సాధించేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు.

ప్రభుత్వ కాలేజీల్లో పెరిగిన అడ్మిషన్లు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 190 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో 2023-24 విద్యా సంవత్సరానికి 168 కాలేజీల్లో ప్రవేశాలకు అనుమతులు ఇచ్చారు. ఈ కాలేజీల్లో మొదటి ఏడాది 41,096 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. గతేడాది 37,488 మంది ప్రవేశాలు పొందారు. దీన్ని బట్టి గతేడాది కంటే 3,608 మంది విద్యార్థులు అదనంగా చేరారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జిల్లాలో 10 జూనియర్ కాలేజీలు నిర్వహిస్తుండగా వీటి లో ఈ ఏడాది 3,335 మంది చేరారు. గతేడాది 2,861 మంది ప్రవేశాలు పొందారు. భీమునిపట్నం, డాక్టర్ వీఎస్, కృష్ణా కాలేజీ, అగనంపూడి, పెందుర్తి, విశాఖ బాలికల జూనియర్ కాలేజీలతో పాటు, విశాఖలోని ఒకేషనల్ కాలేజీలకు విద్యార్థుల నుంచి డిమాండ్ ఏర్పడింది.

ప్రతీ విద్యార్థిపై ఫోకస్



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోజూ స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నాం. సైన్సు, ఆర్ట్స్ గ్రూపులకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రతీ విద్యార్థిపై దృష్టి పెట్టేలా సబ్జెక్టు అధ్యాపకులకు బాధ్యతలు అప్పగించాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. అధ్యాపకులంతా సమన్వయంతో పనిచేసి, ఈ సారి మెరుగైన ఫలితాలు సాధిస్తాం.

– జే.విజయ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, విశాఖ

ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకోవాలి



ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కచ్చితంగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రిన్సిపాల్స్ బాధ్యత తీసుకోవాలి. స్పెషల్ క్లాసులు నిర్వహణ తీరుపై ఏ రోజుకారోజు నివేదిక ఇవ్వాలి. విద్యార్థులంతా తప్పనిసరిగా తరగతులకు హాజరయ్యేలా చూడాలి. గైర్హాజరయ్యే విద్యార్థులను గుర్తించి, అందుకగల కారణాలపై వారి తల్లిదండ్రులతో మాట్లాడాలి.

– బి. రాధ, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి, విశాఖ

కళాశాలల్లో తనిఖీలు



విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించాలనేది ప్రభుత్వం ఉద్దేశం. అందుకనే ఈ సారి ప్రాక్టికల్స్ తరగతుల నిర్వహణ కూడా షెడ్యూల్ మేరకు నిర్వహించేలా కాలేజీల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. అన్ని సబ్జెక్టులపై విద్యార్థులు పట్టు సాధించేలా పాఠ్యాంశాల బోధన సాగాలి. ఈ విషయంలో అలసత్వం వహించే కాలేజీలపై చర్యలు తీసుకుంటాం.

–రాయల సత్యనారాయణ, ఆర్ఐవో, విశాఖ

స్పెషల్ క్లాసులతో మేలు



వార్షిక పరీక్షలకు మమ్మల్ని సిద్ధం చేసేలా నిర్వహిస్తున్న స్పెషల్ క్లాసుల వల్ల ఎంతో ఉపయోగం ఉంది. నేను సీఈసీ గ్రూపు తీసుకున్నాను. కామర్స్ గ్రూపుల వారికి కూడా మా లెక్చరర్లు ఎంతో బాగా పాఠాలు చెబుతున్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చదువుకుంటున్నాను. స్పెషల్ క్లాసుల్లో రివ్యూ చేస్తుండటంతో సబ్జెక్టుల్లో తలెత్తే అనుమానాలు నివృత్తి చేసుకుంటున్నాం.

– తిప్పని సత్యవతి, విద్యార్థిని, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, విశాఖ